بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ    نَحْمَدُهٗ وَنُصَلِّى عَلٰى رَسُوْلِهِ الْكَرِيْمِ    وَعَلٰى عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

## హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ **ఖుత్బా జుమా 14.2.2014 సారాంశము**, మస్జిద్ బైతుల్ ఫుతూహ్, లండన్

తషహ్హుద్, తఅవ్వుజ్, సూర ఫాతిహా పఠనానంతరము హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ప్రసంగించిరి.

నేడు నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తన సంకేతముల గురించి తెలిపిన కొన్ని ప్రవచనములను ప్రస్తావించెదను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ విషయములో ఒక ప్రాథమిక సూత్రము చాలా స్పష్టముగా ఇట్లు తెలిపిరి. బహిర్గతమైన, బహిర్గతమగుచున్న లేదా మున్ముందు బహిర్గతమగు ఈ సంకేతముల ముఖ్య ఉద్దేశము అల్లాహ్ ఈ కాలములో తన ద్వారా ఇస్లాం సత్యమును ప్రపంచమునకు స్పష్టము చేయదలచెను. ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం గొప్ప స్థాయి, స్థానమును ప్రపంచమునకు తెలుపదలచెను. ఈ సంకేతములు ఇతరులు, ఇస్లాంపై విమర్శలు చేసే వారి నోరు మూయించుటకే గాక ముస్లిముల కొరకు తానే ఇస్లాం పునరుద్ధరణ కై అల్లాహ్ పంపిన దైవ స్వరూపుడనుటకు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం సత్య నిదర్శనములగును.

ఈ విషయము గూర్చి హుజూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ బరాహీనె అహ్మదియ్య, కిష్తి నూహ్ నుండి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం వాక్యములను ప్రవేశపెట్టిరి. కిష్తి నూహ్‌లో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

"అల్లాహ్ నాకు తెలిపిన తమ నిర్ణీత సమయమున పూర్తయిన పరోక్ష విషయములు పది వేలకు తక్కువగా లేవు. కాని ముద్రించబడుతున్న నుజూలుల్ మసీహ్ పుస్తకములో ఉదాహరణగా 150 నిదర్శనములు, సాక్ష్యులతో సహా వ్రాయబడినవి. పూర్తి కాని నా ఏ భవిష్యవాణి లేదు. లేదా దాని రెండు భాగాలలో ఒక భాగము పూర్తి కానిది ఏది లేదు. నా నోట వెలువడి పూర్తి కాని భవిష్యవాణిని ఎవడైనా వెతికినచో అతడు వెతుకుచు మరణించును కాని అటువంటిది దొరకదు. కాని నిస్సిగ్గుగా లేదా అజ్ఞానములో ఏమైనా అనవచ్చును. లక్షలాది సాక్ష్యుల సమక్షమున వేలాది స్పష్టమైన భవిష్యవాణీలు సవివరముగా పూర్తయినవని నేను దావా చేయుచున్నాను. వాటి ఉదాహరణను వెతికినచో ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం లో తప్ప గడిచిన ఏ సందేశహరులలో లభించదు.

హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ నుజూలుల్ మసీహ్ పుస్తకము నుండి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి పలు భవిష్యవాణీలను ప్రస్తావించినారు.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి అల్లాహ్ ఈ భవిష్యవాణి తెలిపెను.

یا احمد فاضت الرحمة علی شفتیک (చూడుము: బరాహీనె అహ్మదియ్య పుట 517)

**అనువాదము** ఇట్లు గలదు. ఓ అహ్మద్ ! నీ పెదవులపై దయ కొనసాగును. సాహిత్యము, పాండిత్యము, జ్ఞానము, రహస్యములు నీకు అందించబడును. కనుక అటులనే ఎవరు పోటీకి రాలేనటువంటి నా సాహిత్యము గొప్ప నిదర్శనము చూపెను. ఈ దైవవాణి తర్వాత నేను 20కి పైగా పుస్తకములు, పత్రికలు గొప్ప సాహిత్యముతో అరబ్బిలో ముద్రించితిని. కాని ఎవరు పోటీకి రాలేక పోయెను. అల్లాహ్ వారి హృదయము, నాలుక రెండింటిని వశపరచుకొని నాకిచ్చెను.

మరల వారిట్లు తెలిపిరి. یریدون ان یطفئوا نور اللہ بافواھھم واللہ متم نورہٖ ولو کرہ الکافرون۔

(చూడుము: బరాహీనె అహ్మదియ్య పుట 240)

**అనువాదము**: వ్యతిరేకులు తమ నోటితో ఊది అల్లాహ్ జ్యోతిని ఆర్పవలెనని దలతురు. అనగా అనేక కుట్రలకు పాల్పడుదురు. కాని అవిశ్వాసులు ఇష్టపడకున్నను అల్లాహ్ తన జ్యోతిని పూర్తి చేయును.

ఈ జమాఅత్‌నకు ప్రతికూలముగా వ్యతిరేకులకు ఎలాంటి ఉద్రేకము, కోపము లేని నాటి కాలపు భవిష్యవాణి ఇది. అనగా వ్యతిరేకులెవరూ లేకుండిరి. కాని వ్యతిరేకులు అంతమగుదురని భవిష్యవాణి చేయబడుతుంది. ఈ భవిష్యవాణి తర్వాత 10 సం॥లకు అంతులేని ఉద్రేకము చూపబడెను. అవిశ్వాస పత్రము వ్రాయబడెను, హత్యా తీర్మానాలు చేయబడెను. వందలాది పుస్తకములు, పత్రికలు ప్రచురించబడెను. మౌల్వీలందరు వ్యతిరేకులైరి. నన్ను నాశనము చేయుటకు అత్యంత నీచమైన ఏ ప్రణాళికను వదల లేదు. కాని ఫలితము తలక్రిందులైనది. ఈ జమాఅత్ అసాధారణ రీతిలో అభివృద్ధి చెందెను.

మరల వారిట్లు తెలిపిరి. ان لم یعصمک الناس فیعصمک اللہ من عندہ۔ یعصمک اللہ من عندہ و ان لم یعصمک الناس

(చూడుము: బరాహీనె అహ్మదియ్య)

ప్రజలు నిన్ను రక్షించకున్నను అనగా నిన్ను నాశనము చేయుటకు ప్రయత్నించును. కాని అల్లాహ్ తన వద్ద నుండి కారణములు సృష్టించి నిన్ను రక్షించును. ప్రజలు రక్షించదలచకున్నను అల్లాహ్ నిన్ను తప్పక రక్షించును.

ఇది ఎంతటి గొప్ప, అద్భుత సంకేతమో చూడుము. రెండు సార్లు రక్షణ వాగ్దానము చేయబడెను. నిన్ను నాశనము చేయుటకు ప్రజలు ప్రయత్నించుదురని ఇందులో స్పష్టముగా వాగ్దానము చేయబడెను. వివిధ ప్రణాళికలు రచించుదురు. కాని అల్లాహ్ నీ వెంట వుండును. అతడు ఆ ప్రణాళికలను వృధా చేసి నిన్ను రక్షించుకొనును. ఏ ప్రణాళిక రచించబడలేదో ఇప్పుడు గ్రహించవలెను. నన్ను నాశనము చేయుటకు వివిధ కుట్రలు చేయబడెను. హత్యా వ్యాజ్యములు మోపబడెను. అవిశ్వాస పత్రములు వ్రాయబడెను. కాని అల్లాహ్ అన్నిటిని విఫలము చేసెను. వారు ఏ కుట్రలో సఫలీకృతులు కాలేదు.

హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి భవిష్యవాణీల 3,4 ఉదాహరణలు నేను ప్రవేశపెట్టితిని. ఇటులనే వారి పుస్తకములు కూడ ఒక సంకేతమే. దీని గురించి వారిట్లు తెలిపిరి.

నేను వ్రాయుచున్నప్పుడు కూడ అల్లాహ్ మహిమను ప్రత్యేకముగా చూచెదను. ఎందుకనగా నేను అరబ్బి లేదా ఉర్దులో ఏదైనా వ్రాయునప్పుడు లోపలి నుండి ఎవరో నన్ను బోధించుచున్నట్లు నేను గమనించెదను. నా రచన అరబ్బి, ఉర్దు లేదా ఫారసీ అయినను రెండు భాగాలలో వుండును. ఒకటి చాలా సులభముగా అక్షరముల పరంపర నా ముందు వచ్చును నేను దానిని వ్రాయుదును. ఈ వ్రాయుటలో నేను శ్రమ పడాల్సిన అవసరముండదు. కాని వాస్తవానికి ఆ పరంపర నా మేధాశక్తికి మించినది కాదు. అనగా అక్షరాలు, భావాలు ఎటుల వుండుననగా ఒక వేల అల్లాహ్ ప్రత్యేక సహాయము లేకున్నను అతని దయ, సాధారణ కృపతో మానవ సహజ శక్తితో కొద్ది శ్రమ పడి చాలా సమయము తీసుకొని ఆ అంశములను వ్రాయగలను. అల్లాహ్ బాగుగా ఎరుగును. రెండవ భాగము పూర్తిగా మహిమయే. ఉ॥ నేను ఒక అరబ్బి వాక్యము వ్రాయునప్పుడు పలు అక్షరముల అవసరము ఏర్పడును. అవి నాకు తెలియవు. అప్పుడు వాటి గురించి దైవవాణి నాకు మార్గదర్శనము చేయును. దైవవాణి లాగానే ఆ పదమును దేవదూత నా హృదయములో వేయును. నాలుకతో పలుకించును. అప్పుడు నన్ను నేను మరచిపోవుదును.

హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అరబ్బి పుస్తకములు అరబ్బులపై చూపిన ప్రభావములోని కొన్ని ఉ॥ ఈ కాలములో కూడ గలవు. వాటిని తెలిపెదను.

పాలస్తీనురాలైన ఒక స్త్రీ ఇట్లు తెలిపెను. ప్రస్తుత ఆచారము మేరకు హజ్రత్ ఈసా అలైహిస్సలాం ఆకాశమున వున్నారు, అంతిమ కాలములో ఆకాశము నుండి దిగి, ఇతర జాతుల బానిసత్వము నుండి ఖడ్గ బలముతో సమాజమునకు విముక్తి కల్పించుదురు, ఖడ్గ బలముతోనే ప్రజలను బలవంతముగా ఇస్లాంలో చేర్పించుదురని నాకు గట్టి నమ్మకముండెను. కనుక నేను చాలా ఆత్రుతతో ఆ దినము కొరకు నిరీక్షించుచుంటిని. ఇంతలో నా మరిది ద్వారా నాకు జమాఅత్

పరిచయమయ్యెను. వారు జమాఅత్ గురించి తరచుగా మాట్లాడడమే గాక హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం అరబ్బి పుస్తకములు, లిటరేచర్ కూడ నాకు పంపేవారు. ఆ పుస్తకములో నాకు సాటిలేని, అమూల్యమైనవి లభించినవి. ఇటువంటి జ్ఞానములను నా జీవితములో నేనెన్నడు చదవలేదు. ఇంతటి సాహిత్యము, పాండిత్యముతో కూడిన వజ్రాలను అమర్చనైనది. నాకు పూర్తిగా క్రొత్తగా యుండెను. ఇటువంటి వజ్రాలతో కూడిన పుస్తకములను చదవడంతోనే మనిషికి అల్లాహ్‌తో సంబంధమేర్పడుట మొదలగును. సంపూర్ణ తృప్తి తర్వాతనే నేను బైఅత్ చేసినాను.

అరబ్బుడైన ఇటలీ వాసి అబ్బాస్ గారు ఇట్లు తెలిపిరి. మౌల్వీలు కోపగించుకున్నను నేను ఎం.టి.ఏ అల్ అరబియ్యను వీక్షించేవాడిని. ఒక రోజు నేను అల్‌హావార్ చూస్తుండగా విరామంలో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఈ అరబ్బి పద్యము వచ్చెను. علمی من الرحمن ذی الآلاء باللہ حزتُ الفضلَ لا بدھاءِ నేను ఈ పద్యమును వింటూ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం చిత్రమును కూడ చూచుచుంటిని. ఇంతలో యాదృచ్ఛికముగా నా నోట ఈ అక్షరములు వెలువడెను. అల్లాహ్ ప్రమాణముగా ఒక అసత్యుడు ఇది అనలేడు. ఈ వ్యక్తి తప్పక అల్లాహ్ దూతయే. అల్లాహ్, అతని ప్రవక్తను కించపరచు వ్యక్తి ఇటువంటి వాక్యము అనలేడు.

మరాకిష్ వాసి ఖాలిద్ గారు ఇట్లు తెలిపిరి. అహ్మదియ్య జమాఅత్‌తో పరిచయమైన తర్వాత ఇమామ్ మహ్దీ వచ్చి పోయెను. ఇప్పుడు మాకు తెలుస్తుందా అని నేను ఆశ్చర్యానికి లోనైతిని. బాగా ఆలోచించి నేను అల్లాహ్‌ను మార్గదర్శనము కోరితిని. జమాఅత్ వెబ్‌సైట్‌లో గల అరబ్బి పుస్తకములను చదవడం ప్రారంభించితిని. నేను చదివిన మొట్ట మొదటి పుస్తకము ఇస్లాం తత్వజ్ఞానపు అరబ్బి అనువాదము. దీనిని నేను అనేక సార్లు చదివినాను. ఈ పుస్తకములో న్యాయము, ఉపకారము, బంధువులతో సత్‌ప్రవర్తన అంశములను చదివి నేను చాలా ప్రభావితమైతిని. ఆ తర్వాత నేను “అత్తబ్లీఘ్” ఇంకా ఇతర పుస్తకములను చదివినాను. ఈ పుస్తకములు ఆధ్యాత్మిక జ్ఞానము, ధార్మిక రహస్యముల నదులు ప్రవహింపజేసినవి. నాకు నిధి లభించినదను వాక్యము తరచుగా నా నాలుకపై వచ్చు చుండెను.

మన అమాద గారి గూర్చి హానీ తాహిర్ గారు ఇట్లు తెలిపిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మర్యమ్ అగు, ఆ మర్యమ్‌లో ప్రాణము ఏర్పడు విషయము మన వెబ్‌సైట్‌లో అడిగిరి. అప్పుడు వారిని సంప్రదించి వారికి కొన్ని వ్యాసములు, ప్రవచనములు పంపబడెను. వారు చాలా ప్రభావితులై, వాస్తవమును పొందిరి. వారిట్లు వ్రాసిరి.

హుజూర్ అలైహిస్సలాం పుస్తకము “అత్తబ్లీఘ్” నా హృదయమును తెరిచెను. ఈ కాలములో కూడ ప్రవక్తల వాక్యము చదివే అవకాశము నాకు లభించినదని నాకు ఆశ్చర్యకర ఆనందము కలిగెను. నా గత అనుమానాలు, సందేహాల గూర్చి విచారము కూడ కలిగెను.

యమన్ వాసులైన అతామీ గారు ఇట్లు తెలిపిరి. ఒక పాత్రికేయునిగా, పరిశోధకునిగా వాస్తవము తెలుసుకునే ఉత్సాహము నాకు కలిగెను. కనుక జమాఅత్ వ్యతిరేకుల పుస్తకములు చదివితిని. వాటిలో అనుచిత నిందల తర్వాత అవిశ్వాస తీర్మానము కనిపించెను. గత విమర్శలు తప్ప మరేమి లేదని లోతైన పరిశోధన తర్వాత తెలిసెను. రెండవ వైపు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి అరబ్బి భాష లాంటి మహిమలుండెను. ఇమామ్ మహ్దీని ఫారసీయులలో పుట్టించుట కూడ ఒక దైవ మహిమే. అరబ్బులలోనే మహ్దీ వచ్చుట అనివార్యము కాదు. ఎందుకనగా మార్గదర్శనము, ప్రవక్తృత్వము అరబ్బుల పైనే ఆధారపడి లేదు. ఇతరుల తప్పేమిటి.

హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లనిరి. ఇటువంటి సంఘటనలు అనేకము గలవు. నేను కొన్ని మాత్రమే ప్రవేశపెట్టినాను. మరల ఈ సంకేతముల గురించి ఒక చోట హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు ప్రవచించిరి.

నా ద్వారా వందలాది సంకేతములు బహిర్గతమైనవి. సంకేతములు చూపుటలో నాకు పోటీగా వచ్చి నాపై విజయము సాధించే వ్యక్తి ఎవరైనా భూమిపై వున్నారా ? నా ప్రాణము ఎవరి చేతిలో వున్నదో ఆ అల్లాహ్ ప్రమాణముగా

ఇప్పటి వరకు రెండు లక్షలకు పైనా సంకేతములు నా ద్వారా ప్రత్యక్షమైనవి. బహుశ పది వేలకు పైగా వ్యక్తులు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను స్వప్నములో చూసినారు. వారు (స) నన్ను బలపరచిరి. ఈ దేశములో స్వప్నములు చూసే పేరుగాంచిన, మూడు, మూడు, నాలుగు, నాలుగు లక్షల అనుయాయులు గల వారికి ఇతడు అల్లాహ్ తరపు వాడని చూపబడెను. వారిలో కొందరు నా రాక కంటే 30 సం॥ల క్రితమే ఈ ప్రపంచమును వదిలి పోయిరి.

ఆ తర్వాత హుజూర్ పుర్‌నూర్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ స్వప్నములో ఆన్‌హజ్రత్ సల్లల్లాహు అలైహి వసల్లం మార్గదర్శనముతో అహ్మదియ్య జమాఅత్‌లో చేరిన వారి విశ్వాసపూరిత సంఘటనలు వినిపించిరి.

అబ్దుస్సత్తార్ తండ్రి అబ్దుల్లాహ్ ఇట్లు తెలిపిరి. మసీహ్ మరణపు సమస్య మాకు అర్థం కాదు. బ్రతికి వున్నాడని అర్థమగును. ఎందుకనగా మసీహ్ సజీవముగా నున్నాడను విషయము విన్నాము. కావున మాకీ విషయము తెలుపగలరని నేను నా తండ్రిని ప్రశ్నించితిని. బైఅత్ చేసిన 7,8 నెలల తర్వాతి ఒక స్వప్నము చెప్పిరి. రావీ నది ఒడ్డున రెండు గుడారములు వేసివున్నవి. ఒకటి మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంది కాగా రెండవది రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లంది. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం గుడారములో నేను ప్రవేశించి మసీహ్ మౌవూద్ ప్రకటన చేయువారు ఎలాంటి వారని అడిగితిని. ఇతడు చాలా సమర్థుడు, చాలా సమర్థుడు, చాలా సమర్థుడు, అని మూడు సార్లు వ్రేలు చూపుతూ అనిరి. సంపూర్ణ సాక్ష్యము చూసి వారు అనగా మసీహ్ మౌవూద్ తన ప్రకటనలో సత్యులని నాకు నమ్మకమైనది. మాకు జీవనపు, మరణపు సమస్యల అవసరము లేదు. విశ్వసించి బైఅత్ చేసినాము.

సర్దార్ కరమ్ దాద్ గారు ఇట్లు తెలిపిరి. నేను బైఅత్ చేసే ముందు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను స్వప్నములో చూసితిని. ఒక రహదారిపై హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం, హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కలిసి నడుచుచున్నారు. దాసుడు ముందు నుండి వచ్చుచున్నాడు. హజ్రత్ ముహమ్మద్ రసూలుల్లాహ్ సల్లల్లాహు అలైహి వసల్లం దాసుడినుద్దేశించి ఇట్లనిరి. వ్రేలు చూపుతూ ఇతడు అల్లాహ్ తరపువాడు. ఇతడు అల్లాహ్ తరపువాడు. మూడు సార్లు హుజూర్ అనిరి. నేను క్రీ.శ. 1902లో శాంతి నిలయమైన ఖాదియాన్‌లోని చిన్న మస్జిద్‌లో బైఅత్ చేసినప్పుడు నేను అదే రూపములో హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను చూచితిని.

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు తెలిపిరి.

మన సంఘమునకు అల్లాహ్‌తో నిజమైన బంధము వుండవలెను. అల్లాహ్ వారిని వృథాగా వదిలిపెట్టలేదని కృతజ్ఞతలు తెలుపవలెను. వారి విశ్వాస శక్తులను నమ్మక స్థాయికి పెంచుటకు వందలాది సంకేతములు చూపెను. మనము అల్లాహ్‌తో సత్సంబంధము ఏర్పరచు కొనువారమగు గాక! ఎటువంటి బంధమనగా మనలో ప్రతి ఒక్కరిని తన సంకేతమును చూపుటకు ఎన్నుకొని, మన విశ్వాసమును పెంచుగాక! అల్లాహ్‌తో సత్సంబంధము ఏర్పరచుకొనుము, జమాఅత్‌కు విశ్వాసులుగా నుండుమను ఈ స్ఫూర్తిని రాబోవు తరాలలో నింపువారముగాక! హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం బైఅత్ చేసినందుకు దానిని గౌరవించుము. అల్లాహ్ మన సంతానములో కూడ విశ్వాసమును స్థిరపరచి, దానిని పెంచుగాక!

✪ ✪ ✪